క్లుప్తంగా

ఓటర్ స్లిప్పుల పంపిణీ



స్లిప్పుల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్వో, ఏఆర్ఓ

నగరి: ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరి పట్టణంలోని ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు ఓటరు స్లిప్పులను అందించే ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. ఓటరు పేరు, పోలింగ్ కేంద్రం, పోలింగ్ తేదీ వివరాలు ఉన్న ఓటర్ స్లిపులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రిటర్నింగ్ ఆఫీసర్ వెంకరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మంజునాథ్ గౌడ్ పర్యవేక్షించి, ఓటర్లకు ఓటు వేయడానికి సంబంధించి అవగాహన కల్పించారు. ఓటర్లు ఇంటి వద్ద ఉండి స్లిప్పులను తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

కృపాలక్ష్మిని గెలిపించండి



ఓటు అడుగుతున్న మహిళా నేతలు

పెనుమూరు(కార్వేటినగరం): ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించాలని సామిరెడ్డిపల్లి ఎంపీటీసీ జమున, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మీనా తెలిపారు. బుధవారం వారి సొంత ఖర్చులతో గుట్టకిందపల్లి, తలారిపల్లి, బీసీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారురాలు ఈశ్వరమ్మ మాట్లాడుతూ తనకు చేయూత పథకం ద్వారా రూ.75000 అందిందని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాలికి ఆపరేషన్ చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో గృహసారథి విజయశాంతి, నాయకులు శంకర్‌రెడ్డి, రజిని, దేవరాజులు, వరదరాజులు, శంకర్‌బాబు, గణేష్, రవి, గోవిందస్వామి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వసంతోత్సవం



పురవీధుల్లో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

కార్వేటినగరం: కార్వేటినగరంలో ప్రసిద్ధి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవంలో భాగంగా మూడవ రోజు బుధవారం వేడుకలు ముగిశాయి. వేద పండితులు వేకువజామున సుప్రభాతసేవతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన, కొలువు వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. వంసతోత్సవాలను పురస్కరించుకుని మధ్యాహ్నం 2 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారితో పాటు కోదండరామ స్వామి వారి ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, చందనం, పసుపు, తేనె, నారికేళి, సుగంధ జలాలతో వైభవంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. అదేవిధంగా సాయంత్రం వేద పండితులు వేద మంత్రాలతో ఆస్థానం నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామివారు, అదేవిధంగా సీతాసమేత కోదండరాములు స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ పుష్పాలు విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనాలపై కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9 గంటలకు స్వామివారిని ఏకాంతసేవతో వసంతోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, ,ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు దాశరథి, గోపాలాచారి, షరాబు సురేష్‌బాబు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. కల్యాణ వెంకన్న శ్రవణోత్సవం



నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. శ్రవణం గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనం కొలువుదీర్చి తిరు వీధుల్లో ఊరేగించారు. ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, షరాబ్ షనాయ్, భద్రతా జమేదార్ వెంకటరమణ పర్యవేక్షించారు.

జగనన్నను మరోమారు ఆశీర్వదించండి

- సీఎం జగనన్నతోనే బంగారు భవిష్యత్
- పేదల తలరాతలు మారాలంటే ఫ్యాన్‌కు ఓటెయ్యండి
- ఎన్నికల ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప



గజమాలతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్పకు స్వాగతం పలుకుతున్న నేతలు



ఉత్సాహంగా స్టెప్పులు వేస్తున్న మహిళలు

వెదురుకుప్పం: గడిచిన 5 ఏళ్లలో సీఎం జగనన్న ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందించి ప్రగతికి ప్రతిరూపంగా నిలిచినట్లు ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ పరిధిలోని తెల్లగుండ్లపల్లె, ఎస్సీ కాలనీ, మనవర్తికొత్తూరు, తోటానుపల్లె, తెట్టుగుండ్లపల్లె, దేవళంపేట, బొమ్మయ్యపల్లె, చిన్నబొమ్మయ్యపల్లె, గారంపల్లె, రామకృష్ణాపురం, జడబాపనపల్లె గ్రామాల్లో ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా రెడ్డెప్ప, ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ పేదల బతుకులు మారాలంటే అది ఒక్క విద్యతోనే సాధ్యమవుతుందని భావించి ఉన్నతవిద్యకు శ్రీకారం చుట్టారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాలకు నవరత్నాల ద్వారా ప్రభుత్వ ఫలాలను అందించి వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచినట్లు గుర్తు చేశారు. పేదలకు మరింత మంచి, ప్రగతి సాధించాలంటే రెండోసారి జగనన్నను సీఎం చేసుకోవాలని సూచించారు. గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి సాధించాలంటే వైఎస్సార్‌సీపీ పాలన రావాల్సిందే అని కోరారు. మీరు వేసే ఓటుతోనే మీ భావితరాల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని చెప్పారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ సీఎం జగనన్న ద్వారా వెదురుకుప్పం మండలానికి పాలిటెక్నిక్ కళాశాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. మండలాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని, ప్రతిఒక్కరూ మంచిగా ఆలోచించి జగనన్నను సీఎం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెల్లగుండ్లపల్లెలో హోరెత్తిన ప్రచారం

తెల్లగుండ్లపల్లెలో బుధవారం స్థానిక సర్పంచ్ చొక్కా గోవిందయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం హోరెత్తింది. జైజగన్ నినాదంతో పల్లెలు మార్మోగాయి. ముందుగా ఉప ముఖ్యమంత్రికి క్రేన్ ద్వారా గజమాల వేసి పూల వర్షం కురిపించారు. డప్పు వాయిద్యాలతో మహిళలు పెద్దఎత్తున చిందులు వేశారు. మామిడి తోరణాలు, పార్టీ జెండాలతో గ్రామాల్లో అలంకరించి మంగళ హారతులతో స్వాగతించారు. దేవళంపేటలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి పేట ధనుంజయరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు గోవిందయ్య, రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు పురుషోత్తం, అరుణ, చెంగల్‌రెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్, చిన్నబ్బ, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఉమాచంద్రారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రాణెమ్మ, మాజీ సర్పంచ్‌లు గోవిందన్, పెద్దిరెడ్డి, చిరంజీవిరెడ్డి, చిన్నబ్బరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీలు ధనుంజయరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ, సీనియర్ నాయకులు భీమశంకర్‌రెడ్డి, రవి రెడ్డి, రామ్మూర్తి, లోకనాథం, రవి, ఉమాపతి, వాసు, పురంధర్ రెడ్డి, దొరై, రాము, చంద్రారెడ్డి, బొజ్జారెడ్డి, మునస్వామి, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్య పరచండి



మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువత

- మంత్రి రోజా

పుత్తూరు: రాష్ట్రంలో మరోమారు జగనన్న ప్రభుత్వం ఏర్పడితేనే అందరికీ మంచి జరుగుతుందని నేటి యువత ప్రజలను చైతన్య పరచాలని మంత్రి, వైఎస్సార్‌సీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. బుధవారం పుత్తూరు యువ నాయకులు మనోజ్, రాజశేఖర్ ఆధ్వర్యంలో తిరుమలకుప్పం, కృష్ణసముద్రం, అక్కేరి, వేపగుంట, నందిమంగళం, నెత్తం, కేబీఆర్‌పురం గ్రామాలకు చెందిన పలువురు యువత మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో చూసిన ప్రతి సమస్యను తన పాలనలో పరిష్కరించారని చెప్పారు. మేనిఫెస్టోను ఒక పవిత్రగ్రంథంగా భావించి అమలు చేశారని తెలిపారు. వృద్ధులు, యువకులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల వారిని ఆదుకున్నారని అన్నారు. టీడీపీ నేత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలకు కేంద్ర బిందువు కాగా, మంచికి, చేయూతకు జగనన్న కేంద్ర బిందువని అన్నారు. తాను జగనన్న ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల జీవితాలు మరింత మెరుగుపడాలంటే ఎన్నికల్లో జగనన్న మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, ఇందులో యువత కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, నగరిలో మంత్రి రోజమ్మ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. మంత్రి రోజా గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యువత నాయకులు శివ, వర, రాజశేఖర్, రాజేంద్రబాబు, వెంకటేష్, ఆకాష్, గణేష్, అరుణాచలం, సిమ్సన్, లోకేష్, అజిత్, సుమన్, హరి, గురవయ్య, వంశీ, తరుణ్, విక్రమ్, కిరణ్, అజిత్‌కుమార్, సుమన్‌జోయన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

పుత్తూరు: సాధ్యం కాని హామీల మేనిఫెస్టోతో వస్తున్న చంద్రబాబును రాష్ట్రం నుంచి ప్రజలు తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వడమాలపేట మండలం బాలనాయుడు కండ్రిగ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ సీఎం జగనన్న నేతృత్వంలో మంత్రి ఆర్కే రోజా అందించిన సంక్షేమ ఫలాలు వడమాలపేట మండలంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన తర్వాత మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలను సంక్షేమ పథకాలతో ఆదుకున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి పనులు కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు స్కాముల పేరిట ప్రజాధనాన్ని దోచేసి, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని ఆరోపించారు. మీ ఆడపడుచు అయిన మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా మూడవసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

మోసానికి పరాకాష్ట టీడీపీ మేనిఫెస్టో



నింద్ర: కొప్పేడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి రోజా

- బాబు హామీల అమలుకు రాష్ట్ర బడ్జెట్ కాదు దేశ బడ్జెట్ కావాలి
- ప్రజలను ఏమార్చి ఓట్లు గుంజుకోవడమే చంద్రబాబు లక్ష్యం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

నింద్ర: టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో మోసానికి పరాకాష్టగా ఉందని అందులో ఉన్నవి అమలు చేయాలంటే రాష్ట్ర బడ్జెట్ సరిపోదని, దేశ బడ్జెట్ కావాలని మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం కొప్పేడు పంచాయతీలోని కొప్పేడు, కొప్పేడు దళితవాడ, వేదాంతపురం ఎస్టీ కాలనీ గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. క్రేన్‌ద్వారా భారీ గజమాలను వేసి, పూలవర్షం కురిపించి, ఇంటింటా హారతులు పట్టి అభిమానం చాటుకున్నారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ అహర్నిశలు కృషి చేసి ఆదర్శంగా నిలిచిన రోజమ్మనే మళ్లీ గెలిపించుకుంటామని మహిళలు, యువత స్పష్టం చేశారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ఫొటోల ఆధారంగా మంత్రి రోజా ప్రజల ముందు ఉంచారు. వాస్తవాలను మాత్రమే ప్రజల ముందు ఉంచి ఓటు అడిగే ఏకైక పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసేలా జగనన్న మేనిఫెస్టో ప్రవేశపెడితే అందరినీ సమానంగా మోసం చేసేలా చంద్రబాబు మేనిఫెస్టో సిద్ధం చేశారన్నారు. ప్రచారంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో–ఆప్షన్ మెంబర్ అనిల్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ వేణురాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామోదరం, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చెంచమ్మ, సచివాలయ కన్వీనర్ గిరిరెడ్డి, నాయకులు చిరంజీవి, సునీల్, సుమన్ బాలాజీ, విజయ్‌కూమార్, శ్యామ్, సుజీత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలతో జాగ్రత్తగా ఉండండి

- మంత్రి ఆర్కేరోజా భర్త ఆర్కే సెల్వమణి

నగరి: మాయమాటలు నేర్చిన టీడీపీ నేతల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి ఆర్‌కే రోజా భర్త, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని కొత్తపేటలో ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ పర్యటించి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో చెప్పిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కొత్తపేటలో మాత్రమే ఐదేళ్లలో రూ.66 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రజలకు అందుబాటులో రూ.80 లక్షల నిధులతో అర్బన్ హెల్త్ సెంటర్, రూ.1.50 కోట్ల నిధులతో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను కార్పొరేట్ స్థాయిలో నిర్మిస్తున్నామని తెలిపారు. అలాగే నగరిలో 30 ఏళ్లుగా పరిష్కారం కాని మురుగు కాలువ సమస్యను మంత్రి రోజా ప్రత్యేకంగా చొరవ తీసుకుని పరిష్కరించారని చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మంత్రి రోజాకు హ్యాట్రిక్ విజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, భూపాలన్, డిల్లీ, నాయకులు మనోహర్, ఆనంద్‌కుమార్, శశి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు చారిత్రక అవసరం



మహిళలతో కలిసి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్న నాయకులు

పాలసముద్రం: రాష్ట్రానికి అన్నివిధాలా మేలు జరగాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన చారిత్రక అవసరం ఉందని సింగిల్‌విండో చైర్మన్ గాలి జ్యోతి, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, కో ఆప్షన్ మెంబర్ వేణు స్థానిక కార్యకర్తలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సింగిల్‌విండో చైర్మన్ గాలి జ్యోతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. చంద్రబాబు నాయుడు మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, చంద్రశేఖర్ రాజు, షణ్ముగరెడ్డి, రవిరెడ్డి, ప్రేమ్‌కుమార్, గోపాల్, మునిరత్నం, సుధాకర్, శరవణన్, హరి, సుబ్రమణ్యం, వడివేలురెడ్డి, ధనుంజయులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న నాయకులు

నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ జగనన్న



వైఎస్సార్‌సీపీ నేతలపై పూలవర్షం కురిపిస్తున్న కొత్తూరు గ్రామస్తులు



ఆళత్తూరులో ప్రచారం

కార్వేటినగరం: పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె ప్రతిభాగాంధీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆళత్తూరు పంచాయతీ ఈడిగపల్లి, టీటీ కండ్రిగ, కొత్తూరు, ఆళత్తూరు, లక్ష్మీపురం, సీకాయపట్టెడ గ్రామాల్లో ఎంపీపీ లత, సర్పంచ్ గీతాంజలి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగనన్న ప్రభుత్వం ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభాగాంధీ మాట్లాడుతూ నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అయితే అబద్ధాలకు అడ్డాగా చంద్రబాబు నిలుస్తున్నారని గుర్తు చేశారు. ప్రతి కుటుంబానికి నవరత్నాల పథకంలో భాగంగా కలిగిన లబ్ధిని వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ఆశీర్వాదంతో తమ తండ్రి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశారన్నారు. ఈక్రమంలో టీడీపీకి కంచుకోటగా ఉంటున్న కొత్తూరు గ్రామంలో జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన గ్రామస్తులు నేతలకు ఇంటింటా మంగళ హారతులు పట్టి, పూలవర్షం కురిపించారు. అదేవిధంగా ఆళత్తూరు, ఈడిగపల్లి గ్రామాల్లో కూడా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ మండల కన్వీనర్ ధనుంజయవర్మ, టెలికాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జగదీష్, జిల్లా కోశాధికారి ధనుంజయరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, శ్రీనివాసులు నాయుడు, సర్వేశ్వర్, జయకుమార్, ధర్మయ్య, మునికృష్ణ, చిట్టి, చిరంజీవిరెడ్డి, మునేంద్ర, రామిరెడ్డి, నాగరాజు ఆచారి, శేఖర్‌రెడ్డి, నాగరాజు శెట్టి, మాధవయ్య, మహదేవ్, దాము, రాజేంద్ర, రవీంద్ర, ఈశ్వరయ్య, బాలాజీ, రాజేంద్ర, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి జగనన్న





రామ్‌ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆటో యూనియన్ నాయకులు, ర్యాలీని ప్రారంభిస్తున్న మురగారెడ్డి

నగరి: కార్మిక పక్షపాతి జగనన్న అని మంత్రి ఆర్‌కే రోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని టవర్‌క్లాక్ సెంటర్ నుంచి కొండచుట్టు మండపం సర్కిల్ వరకు కార్మికులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

ఘనంగా మే డే

పుత్తూరు: కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన రోజు మే డే అని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం వడమాలపేటలో రామ్ రహీమ్ ఆటో యూనియన్ నాయకులతో కలిసి మే డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రభుత్వం కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. కార్మిక కుటుంబాలు మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా, రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. అంతకుముందు ఆయనను ఆటో యూనియన్ నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు.

సమాచార హక్కుల వేదిక ఆధ్వర్యంలో..

కార్మికులు తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి సూచించారు. బుధవారం మేడేను పురస్కరించుకుని స్థానిక ధర్మరాజుల ఆలయం వద్ద నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భవన కార్మికుల సంఘ అధ్యక్షుడు వెంకటరత్నం, సభ్యులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పయనీర్ మిల్లు వద్ద..

స్థానిక పయనీర్ స్పిన్నింగ్ మిల్ వద్ద కార్మిక జెండాను మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ఎగుర వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, సుదర్శన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట వాణిజ్య కూడలిలో అంబేడ్కర్ ఆటో యూనియన్, తిరుపతి రోడ్డులో మహాత్మాగాంధీ ఆటో యూనియన్, మండలకేంద్రంఎస్ఆర్‌పురం సీఐటీయూ యూనియన్ కార్మికులు బుధవారం మే డేని పండుగ వాతావరణంలో జరుపుకున్నారు.